

కంప్యూటర్లో వివరాలు సేకరిస్తున్న విజిలెన్స్ అధికారులు

# మెరుపు దాడులు

## ఇబ్రహీంపట్నం మండల కార్యాలయంలో కలకలం

### పథకాల అమలు, నిధుల వినియోగం తీరుపై విజిలెన్స్ విచారణ

### కీలక ఫైళ్లు స్వాధీనం

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయం బుధవారం విజిలెన్స్ అధికారుల రాకతో ఒక్కసారిగా కలకలం రేగింది. రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ డీజీ శిఖాగోయెల్ ఆదేశాల మేరకు అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఉదయం కార్యాలయానికి చేరుకున్న బృందం తనిఖీలు చేపట్టింది. కంప్యూటర్లలోని డేటా, కీలక ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. పథకాల అమలు, నిధుల వినియోగం, కార్యాలయ సిబ్బంది హాజరు రిజిస్టర్‌కు సంబంధించిన రికార్డులను నిశితంగా పరిశీలించి వాటి జిరాక్స్‌ను తీసుకున్నారు. బయోమెట్రిక్ యంత్రాల ద్వారా సిబ్బంది హాజరు పట్టికను విశ్లేషంచారు. ఉన్నతాధికారులు అందుబాటులో లేకపోవడంతో కింది స్థాయి సిబ్బందిని అధికారులు విచారిం చారు. మధ్యాహ్నం అధికారులు కార్యాలయానికి చెరుకోగానే విచారణ చేపట్టారు. సెలవులో ఉన్న సుఁరిండెంట్‌తో పాటు పంచాయితీ కార్యదర్శులను కార్యాలయానికి పిలిపించి ఎంబీలు, తదతర రికార్డులను పరిశీలించారు. తనిఖీలు పూర్తి అయిన తర్వాత మీడియాకు పూర్తి వవరాలు వెల్లడిస్తామని తెలిపిన విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు వివరాలు వెల్లడించకుండానే వెనుదిరిగారు. ఈ దాడులతో పక్కనే ఉన్న ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లోనూ వణుకు మొదలైంది.



కోట్‌పల్లిలో పసుపు పంట దిగుబడిని పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

### లాభసాటి పంటలపై

# రైతులకు అవగాహన

### కలెక్టర్ దీపక్ తివారీ

**కోట్‌పల్లి, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** రైతులు సంప్రదాయ సాగుకే పరిమితం కాకుండా, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు లాభసాటి పంటల వైపు మళ్లేలా అధికారులే ప్రత్యేక చొర వ చూపి అవగాహన కల్పించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సూచించారు. బుధవారం నాడు ఆయన కోట్పల్లిలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులను, ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేశారు.

**ఉద్యానవన పంటలకు ప్రోత్సాహం**

పర్యటనలో భాగంగా కలెక్టర్ క్షేత్రస్థాయిలో ఆరబెట్టిన పసుపు, ఆయిల్ పామ్ సాగును స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యా నవన పంటల సాగు వల్ల రైతులకు మేలు జరుగుతుందని, ప్రభుత్వం అందించే సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు ప్రోత్సహించాలని ఆదేశించారు.

**విద్యా వ్యవస్థపై ప్రత్యేక నిఘా**

ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలతో పాటు విద్యార్థుల సౌకర్యార్థం ఫ్యాన్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవన నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని అధికారులను ఆదేశించారు.

**బోధన తీరుపై ఆరా**

పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సందర్శించి, సబ్జెక్టు బోధన తీరుపై ఉపాధ్యాయులతో చర్చించారు.

**యూనిఫాం పంపిణీ చేశారా?**

అన్నసాగర్ ప్రీ ప్రైమరీ స్కూల్‌లో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం అమలు, యూనిఫాం, స్టేషనరీ పంపిణీ తీరును సమీక్షి ంచారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, అక్కడ ల్యాబరేటరీ, ఇన్‌పేషెంట్ వార్డులను పరిశీలించడంతో పాటు గర్భిణీల నమోదు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు.

**ఆసుపత్రి భద్రతకు చర్యలు**

ఆసుపత్రి భద్రత కోసం ప్రహరీ గోడ నిర్మాణానికి తక్షణమే అంచనాలను రూపొందించి సమర్పిం చాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండలంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి, పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, ఉద్యానవన శాఖ అధికారి సత్తార్, తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సురేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న దృశ్యం

# రైతు బజారులో మౌలిక వసతులు కల్పించాలి

### కలెక్టర్ దీపక్ తివారి ఆదేశం

**వికారాబాద్, ప్రభాతవార్త :** రైతు బజారులో మౌళిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. బుధవారం వికారాబాద్ పట్టణంలోని రైతు బజార్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతు బజార్‌లో విక్రయదారులకు సౌకర్యవంతంగా ఉండేలా దిమ్మెలు నిర్మించి షెడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవా లన్నారు. రైతు బజారులో రోడ్లు, మంచి నీటి సౌకర్యంతో పాటు మరుగు దొడ్లు, మూత్రశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ తో పాటు పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రైతు బజారులో సమస్యలను కలెక్టర్‌కు నివేదిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# ₹5 కొనే కూ.. దిక్కులేదు

## బోసిపోయిన బంతి, చామంతి

**షాద్‌నగర్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** ఎర్రటి మట్టిలో ఎంతో శ్రమకోర్చి, చెమటోడ్చి సాగు చేసిన బంతి పూలు, నేడు మార్కెట్ ధరలు లేక రోడ్డుపై పారబోసే పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా పండుగలు, శుభకార్యాల సమయంలో బంతి, చామంతి పూలకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. బంతి పువ్వు తన బంగారు వర్ణంతో, చామంతి తన స్వచ్ఛమైన తెలుపు, పసుపు రంగులతో పూజా కార్యక్రమాలకు ప్రత్యేక శోభను ఇస్తాయి. కానీ, ప్రస్తుతం మార్కెట్‌లో వీటికి ఆదరణ కరువైంది. బుధవారం ఉదయం కోతకు

> **పక్కృతి ఒడిలో విరబూసి, శుభకార్యాలకు కళను తెచ్చే బంతి, చామంతి పూలు నేడు రైతుల కళ్లలో కన్నీరు తెప్పిస్తున్నాయి. పండించిన పంటకు సరైన ధర లభించకపోవడంతో రైతు కష్టం బూడిదలో పోసిన పన్నీరుగా మారుతోంది. పూల తోటలు వర్ణశోభితంగా కనిపిస్తున్నా, వాటి వెనుక ఉన్న రైతుల జీవితాలు మాత్రం చీకటిమయమవుతున్నాయి. ప్రస్తుతం ఫరూఖ్ నగర్ మండలం వెల్ జర్ల గ్రామంలో పరిస్థితి హృదయవిదారకంగా మారింది.**

> **పడిపోయిన ధరలతో నిరాశలో రైతులు**
>
> **రవాణా ఖర్చులు రావడంలేదని ఆవేదన**
>
> **వెలిజర్లలో రోడ్డుపాలైన పూలతోటల రైతులు**

సిద్ధమైన పూలను రైతులు ఎంతో ఆశతో హైదరాబాద్ మార్కెట్‌కు తీసుకెళ్లారు. అయితే, అక్కడ పరిస్థితి గందరగోళంగా ఉంది. కేజీ పూలను కేవలం 5 రూపాయలకు కూడా కొనేవారు లేకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు.

**పెట్టుబడి కూడా రాక.. రోడ్డు పాలు**

పంటను సాగు చేయడానికి పెట్టిన పెట్టుబడి, కూలీల ఖర్చులు పక్కన పెడితే, చివరకు మార్కెట్‌కు తీసుకెళ్లిన రవాణా ఖర్చులు కూడా తిరిగి రాకపోవడంతో రైతులు బరువెక్కిన హృదయంతో వెనుదిరుగుతున్నారు. చేసేదేమీ లేక వెల్‌జర్ల శివారులోని రహదారి పక్కన పండించిన పూలను రోడ్లపై పారబోసి వెళ్లిపోతున్నారు. 'రోజంతా కష్టపడి పండించిన పంట ఇలా వృథా కావడం చాలా బాధగా ఉంది' అని రైతులు తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు.

**వ్యవస్థాగత లోపాలే కారణం**

రైతుల ఈ దీన స్థితికి మధ్యవర్తుల ఆధిపత్యం, సరైన మార్కెటింగ్ సౌకర్యాలు లేకపోవడమే ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. ఈ సమస్య నుంచి గట్టెక్కాలంటే ప్రభుత్వం కొన్ని కీలక చర్యలు తీసుకోవాలని రైతులు సూచిస్తున్నారు.

**కోల్డ్ స్టోరేజ్‌లు ఉంటే ఈ నష్టం ఉండేది కాదు**

స్థానికంగా కోల్డ్ స్టోరేజ్ సౌకర్యాలు ఉంటే ఇంత నష్టం ఉండేది కాదని రైతులు పేర్కొంటున్నారు. ధరలు తక్కువగా ఉన్నప్పుడు పూలను నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని, తమ అవస్థలు అర్థం చేసుకుని పాలకులు కోల్డ్ స్టోరేజ్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

**ప్రత్యక్ష మార్కెటింగ్ లేక దళారీల బెడద**

నేరుగా మార్కెట్‌కు కలుపుకునే వ్యవస్థలను ఏర్పాటు చేయడం ద్వారా దళారీల బెడద తగ్గుతుందని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పూల సాగుకు కనీస మద్దతు ధరను ప్రకటించి ఆదుకోవాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. బంతి పూల తోటలు వర్ణశోభితంగా కనిపిస్తున్నా, వాటి వెనుక ఉన్న రైతుల జీవితాలు మాత్రం చీకటిమయమవుతున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఈ నష్టాల గాథకు ముగింపు పలకాలని వెలిజర్ల రైతాంగం కోరుతోంది.



రవాణా ఖర్చులు కూడా రాకపోవడంతో వెలిజర్లలో రహదారిపై పూలను పారబోస్తున్న రైతు

# షాద్‌నగర్ టు జహీరాబాద్

## 190 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**యాలాల, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** ప్రభుత్వం పేదలకు ఉచితంగా అందజేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పట్టింది. భారీ ఎత్తున బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్న బియ్యాన్ని బుధవారం పోలీసులు పట్టుకున్నారు. షాద్‌నగర్ నుంచి జహీరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న సుమారు 190 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ర్యాలాల ఎస్ఐ విఠల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొడంగల్ తాండూరు ప్రధాన రహదారిపై ఉన్న గౌతమి స్కూల్ సమీపంలో యాలాల పోలీసులు, టాస్క్ ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో టాటా కంటైనర్ వాహనం అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేశారు. కంటైనర్‌ను పరిశీలించగా, అందులో ఎటువంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న ప్రభుత్వ రేషన్ బియ్యం కనిపించింది. షాద్‌నగర్, కొందుర్గు ప్రాంతాల నుంచి ఈ బియ్యాన్ని సేకరించి, జహీరాబాద్‌లోని రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పట్టుబడిన 190 క్వింటాళ్ల బియ్యంతో పాటు వాహనాన్ని యాలాల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్ రెడ్డి వెల్లడించారు. పేదల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.



పోలీసుల అదుపులో ఉన్న రేషన్ బియ్యం కంటైనర్

# ఈతకు వెళ్లి..మృత్యు కౌగిలికి

### స్నేహితుల కళ్లముందే నీట మునిగిన విద్యార్థి

### చంద్రకల్ గ్రామంలో విషాదం



**దౌల్తాబాద్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** చదువుకుని ప్రయోజకుడు అవుతాడనుకున్న ఆ చిన్నారిని విధి వెక్కిరించింది. తోటి స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లిన ఒక విద్యార్థి, ప్రమాదవశాత్తు బావిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం చంద్రకల్ గ్రామంలో బుధవారం మధ్యాహ్నం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. చంద్రకల్ గ్రామంలోని హాస్టల్లో ఉంటూ వడితే ఈశ్వర్ (13) అనే విద్యార్థి 8వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు రమేష్, లక్ష్మి ్మలు కూలీ పనులు చేసుకుంటూ కుమారుడిని చదివిస్తున్నారు. బుధవారం పాఠశాల ముగిసిన తర్వాత ఈశ్వర్ తన స్నేహితులతో కలిసి హాస్టల్ సమీపంలోని ఒక బావి వద్దకు ఈత కొట్టడానికి వెళ్ళాడు. మిగతా విద్యార్థులతో కలిసి బావిలోకి దిగిన ఈశ్వర్‌కు ఈత సరిగ్గా రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. తోటి విద్యార్థుల కేకలతో స్థానికులు అక్కడికి చేరుకున్నప్పటికీ, అప్పటికే ఈశ్వర్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న దౌల్తాబాద్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, గ్రామస్థుల సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు కళ్లముందే శవంగా మారడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించడం అందరినీ కలిచివేసింది.



మృతదేహాన్ని వెలికి తీసేందుకు సహాయక చర్యలు చేపడుతున్న పోలీసులు, గ్రామస్థులు, మృతిచెందిన విద్యార్థి ఈశ్వర్

# సమర్థవంతంగా ఆరోగ్య సేవలు ఉండాలి

### అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వైద్య శాఖ పాత్ర ఎంతో కీలకమని, ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆశా ఫెసిలేటర్లకు, ఏఎన్ఎంలకు, ఆశావర్కర్లకు 'సేఫ్ మదర్‌హుడ్' పై వర్క్‌షాపును నిర్వహించారు. దీనిలో గర్భిణీ స్త్రీల ఆంటినేటల్ చెకప్‌లు, మాతృమరణాల రేటు, సిజేరియన్ ప్రసవాలు, గర్భదారణ సమయంలో జాగ్రత్తలు, పోషణ, పిసి,పిఎన్‌డిటి చట్టంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వాటిపై అవగాహన కల్పించారు. జిల్లాలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగ ప్రజా ఆరోగ్య సంచాలకుల ఆదేశాల మేరకు ఈ నెలలో 6వ తేదీ నుంచి 11వరకు హెల్త్ వీక్ కార్యక్రమాన్ని జిల్లాలో డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సి.ఉమాగౌరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖలో విశిష్ట సేవలు అందించిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు, అవార్డులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ సత్యవతి, డాక్టర్ లావణ్యారెడ్డి, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ గీతప్రసాద్, డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

**పిహెచ్‌సి తనిఖీ**

**శామీర్‌పేట :** మూడుచింతలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు చేశారు. బుధవారం మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ ప్రభుత్వ కామిడి వీరారెడ్డి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి అన్ని విభాగాలను పర్యటించి తనిఖీలు చేశారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆరోగ్య కేంద్రంకు అదనపు కలెక్టర్ వచ్చినట్లు సమాచారం అందుకున్న స్థానిక మున్సిపల్ చైర్మన్ జాము రవి విచ్చేసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ తరువాత అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆరోగ్యకేంద్రంలోని రికార్డులను తనిఖీలు చేసి వివరాలపై ఆరా తీశారు. ఆసుపత్రికి సంబంధించిన రికార్డులను, హాజరు పట్టికను, మందుల నిల్వ రిజిష్టర్లు, రోగుల చికిత్స రికార్డులను ఆయన వివరంగా పరిశీలించారు. రికార్డుల నిర్వాహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని అధికారులను ఆదేశించారు. ఆరోగ్యకేంద్రంలో ఉన్న బాలింతలు, మహిళలతో మాట్లాడి ఆరోగ్యసేవలు అందుతున్న వాటి గురించి ఆయన ఆరా తీశారు.



ఆరోగ్య సేవల తీరుపై మహిళా రోగులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్



మేడ్చల్ పెద్ద చెరువు కట్టపై ర్యాంపు వేసి.. నిర్మాణాలు చేస్తున్న దృశ్యం

# మౌనమేలనోయి?

> **బఫర్‌జోన్ నిబంధనలకు నీళ్లు - కబ్జా కోరల్లో చారిత్రక చెరువు - కట్టపైనే ర్యాంపుల ఏర్పాటు - భూములను చదును చేసి భారీ నిర్మాణాలకు సన్నాహాలు**
>
> **పొంచి ఉన్న వరద ముప్పు - భూగర్భ జల మట్టం పడిపోయే అవకాశం**
>
> **పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని స్థానికుల ఆందోళన**
>
> **అధికారుల ప్రేక్షకపాత్రపై ఆగ్రహం**

**మేడ్చల్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** మేడ్చల్ పట్టణంలోని చారిత్రక పెద్ద చెరువు ప్రస్తుతం ఆక్రమణదారుల కోరల్లో చిక్కుకుని విలవిలలాడుతోంది. ఒకప్పుడు వేల ఎకరాలకు సాగునీరు, పట్టణానికి ప్రాణాధారంగా ఉన్న ఈ చెరువు, నేడు అక్రమార్కుల ధనదాహానికి బలైపోతోంది. ముఖ్యంగా చెరువు రక్షణ కోసం కేటాయించిన బఫర్ జోన్, ఎఫ్‌టిఎల్ పరిధులను పూర్తిగా విస్మరిస్తూ యథేచ్ఛగా నిర్మాణాలు సాగుతున్నాయి.

సుమారు 356 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు పరిధిలో అక్రమాలు పరాకాష్టకు చేరాయి. నిబంధనల ప్రకారం చెరువు కట్టపై లేదా కట్టకు ఆనుకుని ఎటువంటి శాశ్వత నిర్మాణాలు కానీ, ర్యాంపులు కానీ నిర్మించకూడదు. కానీ ఇక్కడ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఏకంగా చెరువు కట్టకే ర్యాంప్ వేసి, భూములను సమతలపరిచి భారీ నిర్మాణాలకు సిద్ధం చేస్తున్నారు.

**శిఖం భూములు సైతం ఆక్రమణ?**

ఇప్పటికే కొన్ని చోట్ల బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు కూడా ప్రారంభం కావడం గమనార్హం. చెరువు శిఖం భూములను సైతం కబ్జా చేసి ప్లాట్లుగా మార్చే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి.

**అడేగేవారేరి?**

ఇంత బహిరంగంగా చెరువు అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నా, సంబంధిత శాఖల అధికారులు మాత్రం మౌనంగా ఉండటం స్థానికంగా అనేక అనుమానాలకు తావిస్తోంది. సాధారణ ప్రజలు తమ సొంత స్థలంలో చిన్న ఇల్లు కట్టుకోవాలని చూస్తే నిబంధనల పేరుతో చుట్టుముట్టే అధికారులు, వందల ఎకరాల చెరువు భూమి కళ్లముందే కబ్జా అవుతున్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పేదవాడిపై ఒక నీతి, పెద్దలపై మరో నీతా? అంటూ స్థానిక ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. రియల్టర్లు ఎటువంటి భయం లేకుండా, అడిగేవారు ఎవరూ లేరనే ధీమాతో ముందుకు సాగుతున్నారు.

**వరద నీరు వెళ్లే మార్గం ఏది?**

చెరువుల బఫర్ జోన్లు కేవలం కాగితాల మీద గీతలు కావని, అవి చెరువుల ఊపిరితిత్తుల వంటివని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. బఫర్ జోన్లను ఆక్రమించడం వల్ల చెరువు నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా తగ్గిపోతుంది. వర్షాకాలంలో వరద నీరు వెళ్లే మార్గాలు మూసుకుపోయి, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యే ప్రమాదం ఉంది. భవిష్యత్తులో భూగర్భ జల మట్టం పడిపోయి పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. గతంలో కూడా ఈ చెరువు అక్రమాలపై కేసులు నమోదైనప్పటికీ, అక్రమార్కులు ఏమాత్రం వెనక్కి తగ్గకపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి, చెరువు కట్టకు ఆనుకుని ఉన్న ర్యాంపులను తొలగించాలని, బఫర్ జోన్ ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**మా దృష్టికి వచ్చింది, చర్యలు తీసుకుంటాం: తహశీల్దార్**

పెద్ద చెరువు పరిధిలో బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ ఉల్లంఘనలపై వస్తున్న ఆరోపణలు మా దృష్టికి వచ్చాయి. చెరువు వద్ద జరుగుతున్న నిర్మాణాలపై పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖ అధికారులను ఆదేశించాం. బఫర్ జోన్‌లో నిర్మాణాలు, చెరువు కట్టకు ఆనుకుని ర్యాంపులు ఏర్పాటు చేయడం వంటి విషయాలపై నిజానిజాలు సమగ్రంగా పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించిన చర్యలు తీసుకుంటాం.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

### రూ. 4.30 కోట్లతో బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన

**పెద్దేముల్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్దే ప్రజాప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం పెద్దేముల్ మండలం కందనెల్లిలో రూ.7 లక్షలతో జడ్‌పిహెచ్‌ఎస్ ప్రహరి గోడ, బుద్దారం నుంచి పెద్దేముల్ తాండా కెనాల్ వరకు రూ. 3 కోట్లతో బిటి రోడ్డు పనులు, బాయిమీది తాండా నుంచి షాధిపూర్ వరకు రూ. 1.30 కోట్లతో బిటి రొడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం కందనెల్లి కవితలు, తాటికొండ మణిపూసలు, గాయత్రి మణి పుస్తకాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. రచయితలు వడిచెర్ల సత్యం, బింగి గాయత్రి, తాటికొండ అర్చనతోపాటు విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు దారాసింగ్, కోటపల్లి మార్కెట్ కమిటి చైర్మెన్ అంజయ్య, వైస్ చైర్మెన్ ఎస్.నారాయన్‌రెడ్డి, నాయకులు రుద్రారం మహిపాల్‌రెడ్డి, ఎల్లారెడ్డి కందనెల్లి హెచ్‌ఎంలు శివకుమార్, నర్సి రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.



రాళ్ళగుడుపల్లి గ్రామంలో సిసి రోడ్డుకు భూమిపూజ చేస్తున్న దిశా కమిటి సభ్యులు వడ్ల నందు.

### ఎన్ఆర్ఈజిఎస్ నిధుల నుండి
## సిసి రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు

**మోమిన్‌పేట్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ఏ గ్రామంలోనైన అభివృద్ధి జరుగుతుందంటే అది కేంద్రప్రభుత్వ నిధులేనని బికారాబాద్ దిశా కమిటి సభ్యులు వడ్ల నందు పేర్కొన్నారు. బుధవారం మోమిన్‌పేట్ మండల పరిధిలోని రాళ్ళగుడుపల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్ వర్య మహిపాల్ ఆధ్వర్యంలో ఈ సిసి రోడ్డుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నందు మాట్లాడుతూ చేవెళ్ళ ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి నిధులు, అలాగే ఎంజీఎన్ఆం ఈజీఎస్ నిధులతోనే గ్రామాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు సిసి రోడ్లు, తదితర పనులు జరుగుతున్నాయని అన్నారు. ప్రస్తుతం ఈ సిసి రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు ఎన్ఆర్ఈజిఎస్ నిధుల నుండి మంజూరైనట్లు తెలిపారు. మారుమూల గ్రామమైన రాళ్ళగుడు పల్లికి ఇంకా అవసరమైన అభివృద్ధి పనుల నిమిత్తం నిధులను మంజూరు చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు, బిసి సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య తనయుడు డాక్టర్, ర్యాగ అరుణ్ కుమార్, మండల బిజెపి అధ్యక్షులు గొంగులూరు ఆశిరెడ్డి, ఉపసర్పంచ్, పంచాయతి వార్డు సభ్యులు, నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కోఆప్షన్ పదవులకు నోటిఫికేషన్ జారీ

**ఆమనగల్లు, ఏప్రిల్8, ప్రభాతవార్త:** ఆమనగల్లు మున్సి పాలిటీలో నామినేటెడ్ పదవుల భర్తీకి బుధవారం నోటిఫికేషన్ జారీ అయింది. తెలంగాణ ప్రభుత్వం పురపాలక పరిపాలనశాఖ డైరెక్టర్, కమిషనర్ ఆదేశానుసారం నాలుగు పదవులకు గాను ఏప్రిల్ 9 నుండి 15 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఆమనగల్లు మున్సి పాలిటీలో నాలుగు స్థానాలకు కోఆప్షన్ సభ్యులను నియమించనున్నారు. అందులో రెండు ప్రజాప్రతినిధిగా అనుభవం కల్గిన వారితో ( ఒకటి మహిళ) మరో రెండు స్థానాలు అల్పసంఖ్యాకులు (మహిళలకు ఒకటి ) రెండు స్థానాలు భర్తీ చేయవలసి ఉంటుంది. కాగా ఆమనగల్లు మున్సి పాలిటీలో 15వార్డులు ఉన్న విషయం పాఠకులకు తెలిసిందే.

**కాంగ్రెస్, బిజెపిఇ వరించనున్న పదవులు...**

ఆమనగల్లు మున్సిపాలిటీ నామినేటెడ్ కోఆప్షన్ పదవులు కాంగ్రెస్ ,బిజెపి పార్టీలను వరించనున్నాయి. 15వార్డులలో 8 బిఆర్ఎస్, 6 బిజెపిలు, 1 కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకున్నపటికీ బిఆర్ఎస్ పార్టీ దూకుకు కళ్ళెం వేయాలని రెండు పార్టీలు పరస్పర పొత్తుతో అధికారం చేజిక్కించుకున్నాయి. బిఆర్ఎస్ పార్టీ నుండి ఒకరు జంప్ అయ్యి కాంగ్రెస్‌లో చేరడంతో ఆపార్టీ బలం రెండుకు చేరుకుని ఎమ్మెల్యే అఫిషియే ఓటుతో బిజెపి పార్టీ సహకారంతో చైర్మన్ పదవి వరించింది. అలాగే బిజెపి పార్టీ వైస్ చైర్మన్ పదవి చేపట్టింది. దీంతో నాలుగు స్థానాలు కల్గిన కోఆప్షన్ పదవులు సమానంగా తీసుకుంటాయా. అధికారం రావడానికి సహకరించిన బిజెపీకే అధిక స్థానాలు ఇస్తారా అనే చర్చ జోరుగా సాగుతుంది. అలాగే కోఆప్షన్ పదవులను చేజిక్కిచ్చుకునేందుకు రెండు పార్టీలలో ఆశావాహులు అధిక సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తుంది. నోటిఫికేషన్ జారీ కావడంతో వారి ప్రయత్నాలు మరింత జోరు పెంచినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

## చీపునుంతలలో 100 కెవి ట్రాన్స్ఫార్మర్

**తలకొండపల్లి ఏప్రిల్ 8, ప్రభాతవార్:** తలకొండపల్లి మండల పరిధిలోని చీపునుంతల గ్రామంలో నూతనంగా 100 కే.వి ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ ఆశన్న తెలిపారు. గత కొంతకాలంగా గ్రామంలో విద్యుత్ దీపాల సమస్యలతో గ్రామస్తులు అనేక ఇబ్బందులు గురయ్యారని, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో, గ్రామానికి నూతనంగా 100 కేవి ట్రాన్స్ఫార్మర్ మంజూరు ఇప్పించినట్లు ఆమె తెలిపారు. ట్రాన్స్ఫార్మర్‌తో గ్రామంలో 24 గంటల కరెంటు అందుబాటులో ఉండేందుకు వీలు కలిగిందని, సహకరించిన ఎమ్మెల్యే అసిరెడ్డి నారాయణరెడ్డికి అధికారులకు కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు గుజ్జుల మహేష్ ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలో ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి పనులు పూర్తి చేయనున్నట్లు ఈ సందర్భంగా మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ ఆశన్న, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు గుజ్జుల మహేష్, రామచంద్రారెడ్డి వెంకటరాజు రెడ్డి శారద శేఖర్ రాజు చెన్నకేశవులు ఎస్ శ్రీశైలం చెన్నయ్య బోళ్ళ శివ తదితరులు ఉన్నారు.

## తలకొండపల్లిలో అగస్త్య ఆసుపత్రి ప్రారంభం

### హాజరైన పలువురు నాయకులు

**తలకొండపల్లి, ఏప్రిల్ 8 ,ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలో నూతనంగా అగస్త్య ప్రైవేటు ఆసుపత్రిని ప్రారంభించారు. బుధవారం మండలపరిధిలోని ఆలకుంట తండాకు చెందిన జాంప్ల నాయక్ నూతనంగా ఆసుపత్రిని నిర్మించి ప్రారంభింప చేశారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే వంశీ చందు రెడ్డిలు హాజరై ఆస్పత్రిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మారుమూల తాండకు చెందిన జాంప్ల నాయక్ ఉన్నత చదువులతో ఎదిగారని, మండలంలోని పేద ప్రజలకు సేవలు అందించడానికి ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం ముఖ్య అతిథులందరికీ జాంప్లా నాయక్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాదగిరి నరసింహ, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు గోపాల్ నాయక్, శేఖర్ యాదవ్, లలిత జ్యోతయ్యా, రఘురాములు,రమేష్ యాదవ్, డేవిడ్ , ఉదయ్ కుమార్, తో పాటు ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు .



రోడ్డును పరిశీలించిన ట్రాపిక్ డిసిపి శ్రీనివాస్‌రావుతో పాటు ఏసిపి సంపత్‌కుమార్ తదితరులు.

## ట్రాఫిక్ మళ్లింపు కోసం అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

**ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 8, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ వరంగల్ జాతీయ రహదారిపై అన్నోజిగూడ ఎన్‌టీపీసీ చౌరాస్తా వద్ద నిర్మించనున్న భూగర్భ వంతెన నిర్మాణం కొరకు ట్రాఫిక్ డైవర్స్ చేయడానికి ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు బుధవారం పర్యటించి పరిశీలించారు. డిసిపి శ్రీనివాస్ రావుతోపాటు ఎసిపి సంపత్ కుమార్‌లు అన్నోజిగూడ డీ మార్టు షాపింగ్ మాల్ నుండి అన్నోజి గూడ భూగర్భ హైస్కూలు వరకు సబ్‌రోడ్డులో పర్యటించి పరిశీలించారు. ఎంటిపిసి చౌరాస్తా వద్ద భూగర్భవంతెన నిర్మాణం కానున్న దృష్ట్యా భువనగిరి నుండి నగరం వైపు ప్రయాణించే వాహనాలను సబ్‌రోడ్డులో ట్రాఫిక్ డైవర్షన్ చేయడానికి పోలీస్ ఉన్నతాధికారులు రోడ్డును పరిశీలించారు. అతి తొందరలోనే రోడ్డు పనులు ప్రారంభం కానున్న దృష్ట్యా ట్రాఫిక్ డైవర్షన్ ఉంటుందని రోడ్డు నిర్మాణదారులు తెలిపారు. రోడ్డును పరిశీలించిన వారిలో డిసిపి, ఎసిపిలతో పాటు స్థానిక ట్రాఫిక్ సిఐ, ఎస్సైలతో పాటు ట్రాఫిక్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో సిసి కెమెరాల ఏర్పాటు అభినందనీయం



సిసి కెమెరాల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న సిఐ ఆంజనేయులు



చీర్యాల ప్రభుత్వ పాఠశాలలో సిసి కెమెరాలను ప్రారంభిస్తున్న సిఐ ఆంజనేయులు

**కీసర,ఏప్రిల్8,ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని సిఐ అర్కపల్లి ఆంజనేయులు అన్నారు.బుదవారం కీసర సర్కిల్ పరిధిలోని చీర్యాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల,హరిజనవాడ పాఠశాలల్లో పాఠశాల అధ్యక్షులు శశిరేఖ,జనార్ధన్ అధ్యక్షతన సిసి కెమెరాల ఏర్పాటు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఒక్క సిసి కెమెరాల వందమంది పోలీసులతో సమానమని అలాంటి సిసి కెమెరాలను పాఠశాల ప్రాంగణాన్ని పాఠశాల పరిసరాలను గమనించేలా ఏర్పాటు చేసిన మిలాన్ గ్రూప్ అధినేత అజ్జుబాయ్‌ని అభినందించారు.మిలాన్ గ్రూప్ ఆధ్వర్యంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయడం ఇది రెండవ పాఠశాల కావడం సిసి కెమెరాలను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు.పాఠశాల నడుస్తున్న విధానాన్ని పాఠశాల పరిసరాలను చూసి సిఐ మెచ్చుకున్నారు.ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారే గొప్ప స్థానాలలో నిలబడతారని అలాంటి ప్రభుత్వ పాఠశాలలో ప్రతి విద్యార్థిని చదివించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై,గ్రామ పెద్దలపై ఉందన్నారు.గ్రామ పెద్దల,తల్లిదండ్రుల ఆశయాల మేరకు ప్రభుత్వ పాఠశాలలను పనిచేయాలన్నారు.చీర్యాల ప్రాథమిక పాఠశాల ఒక కార్పొరేట్ స్థాయిలో కనబడుతున్నందుకు ఆ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి అభినందిచదగ్గ విషయమన్నారు.విద్యార్థులకు మంచి విద్యను అందిస్తున్న ఉపాధ్యాయులను నిజంగా అభినందించాలన్నారు.విద్యార్థులు కూడా చక్కగా చదువుకుని ఉన్నత లక్ష్యాలు చేరుకుని తమ పాఠశాలకు గ్రామానికి తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి,కీసర ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంరెడ్డి,చీర్యాల ప్రధానోపాధ్యాయులు రవీందర్,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిల్లాల తిరుమల్‌రెడ్డి,బిజెపి అధ్యక్షులు కోల బాలరాజు యాదవ్,పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు రామేశ్వర్ గౌడ్,జిల్లా కార్యదర్శి ఆనంద్‌రెడ్డి,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యువత క్రీడల్లో రాణించాలి

**కీసర,ఏప్రిల్8,ప్రభాతవార్త:** యువత క్రీడల్లో రాణించాలని ఇంటిటిజెన్స్ డిఎస్‌పి గుర్రం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.బుదవారం కీసర సర్కిల్ పరిధిలోని కీసరలో అంబేద్కర్ ప్రీమియర్ లీగ్ 2026 ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా ఏపిఎల్ 2026 గ్రేస్ బాల్ టోర్నమెంట్‌ని కీసర అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను క్రీడల వైపు నడిపించాలనే ఆలోచనతో అంబేద్కర్ ప్రీమియర్ లీగ్ మండల అంబేద్కర్ సంఘం టోర్నమెంట్ ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు.ఉమ్మడి కీసర మండలంలోని 12 గ్రామాల యువతను తీసుకుని గ్రామానికి ఒక్క టీం చొప్పున ఐక్యత,సమానత్వం అనే అంశంతో మ్యాచ్ నిర్వహించడం ఓ సాహసమేనని అన్నారు.ఇదే పట్టుదలతో మండల అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో మరెన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజర్‌లు తాళ్ల కిరణ్,ఎంకిరాల నర్సింగ్‌రావు,యూత్ నాయకులు కౌకుట్ల జీవన్‌రెడ్డి,అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు బొల్లి మహేష్,కోశాధికారి రొండ్ల మహేష్,సంయుక్త కార్యదర్శులు గంగి ఆంజనేయులు,సుమన్ బన్నీ,పరమేష్,మంచాల మహేష్,నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కీసరలో అంబేద్కర్ ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభించిన ఇంటిలిజెన్స్ డిఎస్‌పి గుర్రం శ్రీనివాస్‌రెడ్డి

# ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

-- అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి

-- అధికారులకు వినతిపత్రం అందజేసిన బిఆర్ఎస్ కౌన్సిలర్లు

**తాండూరు, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** తాండూరు పట్టణంలో ప్రభుత్వ భూములను పరిరక్షించాలని, ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు, కట్టడాలను అడ్డుకోవాలని బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు తాండూరు ఆర్డీఓ, తహసీల్దార్ మున్సిపల్ కమిషనర్‌లను కోరారు. బుధవారం ఆర్డీఓ అనిత, తహసిల్దార్ తారాసింగ్, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డిలకు వేరువేరుగా కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని సర్వే నెంబర్ 111 గొల్ల చెరువు ప్రాతంతో ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ స్థలంలో అనుమతులు లేకుండా కొనసాగుతున్న నిర్మాణాలను అడ్డుకోవాలని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఇర్షాద్, జావిద్, యోగానంద్, అనిల్, నాయకులు సంతోష్‌గౌడ్, రుద్రుపాటిల్, ఏజాజ్ తదితరులు ఉన్నారు.



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

## ప్రతిపక్ష సర్పంచ్‌ను అవమాన పరచడం సరికాదు

..సర్పంచ్ డివై నర్సిములు

**పెద్దేముల్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** కొందరు అధికార పార్టీ నాయకులు అధికారులను తప్పదోవ పట్టించి శిలాఫలకంలో తమ పేరు వేయకుండా చేశారని, ప్రతిపక్ష బిఆర్ఎస్ సర్పంచ్‌ను అవమాన పరచడం సరికాదని పెద్దేముల్ సర్పంచ్ డివై నర్సిములు ఆగ్రహం వ్యక్తంచేశారు. ట్రైబల్ వెల్ఫేర్ కింద బుద్ధారం నుంచి పెద్దేముల తాండా వరకు రూ. 3 కోట్లతో చేపట్టనున్న బిటి రొడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కాగా ఇట్టి విషయమై డివై నర్సిములు అధికారులను ప్రశ్నిస్తుండగా అధికార పార్టీకి చెందిన నాయకులు జోక్యం చేసుకోవడంతో మాటమాట పెరిగి వాగ్వివాదం చోటుచేసుకోగా ఎమ్మెల్యే సముదాయించారు. ఈ సందర్భంగా డివై నర్సిములు మాట్లాడుతూ ట్రైబల్ వెల్ఫేర్ కింద మంజూరైన నిధుల శిలాఫలకాన్ని పెద్దేముల్ పరిధిలో ఏర్పాటు చేయకుండా బుద్ధారంలో ఏర్పాటు చేసి ఆ గ్రామ సర్పంచ్ పేరు రాయడమేంటని ప్రశ్నించారు. పెద్దేముల్‌తాండా నుంచి బుద్ధారం వరకు రాయకుండా బుద్ధారం నుంచి పెద్దేముల్ తాండా వరకు రాయడాన్ని తప్పుపట్టారు. మంగళవారం రాత్రి బుద్ధారం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకంలో తమ పేరు లేకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇట్టి విషయం తమకు సమాచారం రావడంతో సంబంధిత అధికారికి అడుగగా తనకు ఏ పరిధిలో వస్తుందో తెలియదని, అధికార పార్టీకి చెందిన జిల్లా నాయకుడు చెబితే తాను ఏర్పాటు చేశానని చెప్పారని అన్నారు. ఇట్టి విషయంలో వాదించగా బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో పెద్దేముల్‌తాండా పరిధిలో శిలాఫలకం ఏర్పాటు చేసి తమ పేరు రాసి ఉంచారని అన్నారు. ప్రోటోకాల్ పాటించకుండా తమను అవమానానికి గురిచేసారని, ప్రతిపక్ష పార్టీ అని చిన్నచూపుచూడడం సమంజసంకాదని అన్నారు. సంబంధిత అధికారులు ప్రోటోకాల్‌ను పాటింటి ప్రజాప్రతినిధులకు గౌరవం ఇచ్చెలా చూడాలని హితవు పలికారు.

## మల్లిఖార్జున ఖర్గేపై కేసు నమోదు చేయాలి

**కీసర,ఏప్రిల్8,ప్రభాతవార్త:** జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గేపై వెంటనే కేసు నమోదు చేయాలని బిజెపి పార్టీ అధ్యక్షులు కోల బాలరాజు యాదవ్ డిమాండ్ చేశారు.బుధవారం కీసర పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ ఎన్నికల బహిరంగ సభలో ముస్లింలను ఉద్దేశించి మాట్లాడుతూ ఖురాన్‌లో రాసినట్టు నమాజ్ చేసే సమయంలో పక్కన నాగుపాము వస్తే నమాజ్ ఆపి పామును చంపాలి అనే సూక్తి ఏదైతే ఉందో ఖురాన్‌లో ఈ దేశం బిజెపి పార్టీ,రాష్ట్రీయ స్వయం సేవక్ నాయకులను చంపితేనే మీకు రక్షణ ఉంటుందని రెచ్చగొట్టడం కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ముస్లిం మైనారిటీలలో మత కల్లోలాలు లేపి హిందు ముస్లింల మధ్య దాడులకు ప్రేరేపించే విధంగా రెచ్చగొట్టిన మల్లిఖార్జున ఖర్గేపై వెంటనే కేసును నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

## మంతన్ గౌరెల్లిలో అక్షరాభ్యాసం శ్రీమంతాలు



**యాచారం, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** యాచారం మండల పరిధిలోని మంతన్ గౌరెల్లి గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం ఏ ఎల్ ఎంఎస్ సి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పౌష్టిక ఆహారం, అక్షరాభ్యాసం, శ్రీమం తాలు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో సర్పంచ్ కొర్ర అరవింద్ నాయక్, ఉపసర్పంచ్ యాట శ్రీనివాస్, అంగన్వాడీసూపర్వైజర్ తులసి, టీచర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవలో నిరంతరం వైఎస్ రెడ్డి ట్రస్ట్





అవుషాపూర్‌లో చలివేంద్రం ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ కావేరి మచ్చేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి తదితరులు

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** సామాజిక సేవలో వైఎస్ రెడ్డి ట్రస్టు ఎల్లప్పుడూ ముందుంటుందని అవుషాపూర్ మాజీ సర్పంచ్ ఏనుగు కావేరి మచ్చేందర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి ఏనుగు లక్ష్మారెడ్డిలు పేర్కొన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్‌లో బుధవారం వైఎస్ రెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవికాలం దృష్ట్యా బాటసారుల దాహర్తిని తీర్చేందుకు బస్టాప్ పక్కన గత 10 ఏళ్లుగా వైఎస్ రెడ్డి ట్రస్టు ద్వారా చలివేంద్రంలో త్రాగునీటిని అందిస్తున్నారు. మాజీ సర్పంచ్ కావేరి మచ్చేంధర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి ఏనుగు లక్ష్మారెడ్డి, ఘట్‌కేసర్ బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డిలు రిబ్బన్ కత్తిరించి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మొదటి రోజు బాటసారులకు, ఆర్టీసీ, ఆటోల ప్రయాణికులకు చల్లటి మజ్జిగను పంపిణీ చేశారు. వేసవిలో ప్రజల దాహర్తిని తీర్చేందుకు గత 10 సంవత్సరాలుగా ఇక్కడ చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నారని వైఎస్ రెడ్డి ట్రస్ట్ చేపడుతున్నా సేవాకార్యక్రమాలు అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు చెల్లక శ్రీధర్, శ్రీకాంత్‌రెడ్డి, పల్లె మధుసూధన్‌రెడ్డి, సత్యనారాయణ, కంచర్ల వెంకట్‌రెడ్డి, శోభన్‌బాబు, కట్ట మదుసూధన్‌రెడ్డి, ఏనుగు రఘురాంరెడ్డి, గుండె నరేశ్, కొత్త బాలుయాదవ్, కాసుల వెంకటేశ్‌గౌడ్, మహేశ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య యత్నం

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** తన వద్ద ఉన్న సెల్‌పోన్ దొరుకుతుందనే భయంతో ఓఇంటర్ విద్యార్థిని కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యా యత్నం చేసిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అంకుశాపూర్ సమీపంలోని బుద్వేల్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ఎంపిసి మొదటి సంవత్సరం చదువుతున్న మనీషా (16) కళాశాల భవనం రెండో అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. కళాశాలలో సిబ్బంది విద్యార్థుల వద్ద భద్రతా చర్యల్లో భాగంగా తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల గదిలో వస్తువులు, బ్యాగులను చెక్ చేస్తున్న క్రమంలో తమ వద్ద రహస్యంగా దాచిన సెల్‌పోన్ దొరుకుతుందనే భయంతో మనీషా పైకి వెళ్లి దూకింది. దీంతో తీవ్ర గాయాలు కాగా వెంటనే సిబ్బంది, విద్యార్థులు గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతుంది. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన మనీషా కళాశాలలలో గత సంవత్సరం ఇంటర్‌లో చేరి ఎంపిసి చదువుతున్నదని, ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని వారు తెలిపారు.



## అధికారులతో సమీక్ష సమావేశం

**శంకర్‌పల్లి, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** శంకర్ పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకయ్య ఆధ్వర్యంలో ఆయా గ్రామాల సర్పంచులు, తహసీల్దార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఏఈ, మిషన్ భగీరథ అధికారులతో బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్యం మరియు అభివృద్ధి పనులపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా గ్రామాల్లో నీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు.సమావేశంలో చర్చించారు.గ్రామాల్లో తాగునీటి సరఫరా పరిస్థితి సమీప్లషింగ్, డిప్పింగ్ వంటి చర్యలు చేపట్టడం, పైపులైన్ల మరమ్మత్తులు మరియు డ్యామేజీల పరిష్కారం,కొత్త బోర్ల అవసరాల గుర్తింపు,వేసవి కాలంలో తాగునీటి సమస్యలపై ముందస్తు చర్యలు,అదనంగా,గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు మరియు జీపీ ఆస్తుల నిర్వహణపై సూచనలు ఇచ్చారు.

## పశువులకు టీకాలు తప్పనిసరి

### సర్పంచ్ కళ్ళు భాగ్యలక్ష్మి తిరుపతిరెడ్డి



టీకాలు ప్రారంభిస్తున్న సర్పంచ్ భాగ్యలక్ష్మి

**మాడ్గుల,ఏప్రిల్8,ప్రభాతవార్త:** మండలంలోని ఆర్కపల్లిలో పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధి నివారణ కోసం నిర్వహించిన టీకాల కార్యక్రమాన్ని సర్పంచ్ కళ్ళు భాగ్యలక్ష్మి తిరుపతిరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,గాలికుంటు వంటి అంటువ్యాధులు వేగంగా వ్యాపించి పశువుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు.పశువులు రైతుల ఆర్థిక స్థితికి ప్రధాన ఆధారమని,వాటి సంరక్షణలో నిరక్ష్యం చేయరాదని సూచించారు.ప్రతి రైతు తన పశువులకు సమయానికి టీకాలు వేయించడం ద్వారా వ్యాధులను ముందుగానే నివారించవచ్చని ఆమెవివరించారు.గ్రామంలో ఎవరూ టీకాలు మానకుండా ఉండాలని,వైద్య సిబ్బందితో సహకరించాలని కోరారు. గాలికుంటు వ్యాధి సోకితే పాలు ఉత్పత్తి తగ్గడం,పశువులు బలహీనపడటం వంటి సమస్యలు తలెత్తుతాయని,దీని ప్రభావం రైతుల ఆదాయంపై పడుతుందని ఆమె విశ్లేషించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవీందర్,వార్డు సభ్యులు లక్ష్మయ్య,జానీ,రైతులు జంగయ్య,చంద్రయ్యతో పాటు పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం ద్వారా గ్రామ రైతుల్లో అవగాహన పెంపొందించడం,పశుసంరక్షణపై శ్రద్ధ పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

**యాచారం,ఏప్రిల్8, ప్రభాతవార్త:** అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్న తుండ్ల గ్రామంలో మంగళవారం రాత్రి సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు, సిఐ నందీశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కందుకూరు మండలం కొలనుగూడ గ్రామానికి చెందిన ఆధర్ల రాజు వయసు 35 ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తాడు. రాజుకు పెళ్లి జరిగి నాలుగు సంవత్సరాల బాబు ఉన్నాడు. ఆదర్ల రాజు అనుమానాస్పదంగా చిన్న తుండ్ల గ్రామంలో మంగలి షాపు వద్ద పడి ఉన్నాడు. ఈ విషయం బుధవారం తెల్లవారుజామున గమనించిన ప్రజలు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి సిఐ తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. కొలను గూడ గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో అక్కడికి చేరుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఎవరో ఆదర్ల రాజును కొట్టి చంపి ఇక్కడ పడేసి వెళ్లారని అనుమానంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల తో వాగ్వాదానికి దిగారు. దీనిపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు .చేశారు. పోలీసులు డాగ్ స్క్వాడ్ టీమ్ రప్పించి వేలిముద్రలను సేకరించారు. కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.



సంఘటన స్థలంలో ఆదర్ల రాజుమృతదేహం



## నూతన వధూవరులకు మాజీ ఎమ్మెల్యే ఆశీస్సులు

**మోమిన్‌పేట్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** మోమిన్‌పేట్ మండలం బాల్‌రెడ్డిగూడెం గ్రామ బీఆర్ఎస్ పార్టి అధ్యక్షులు దేవెందర్ రెడ్డి అల్లుడి వివాహం మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని భీకేఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగిన వివాహానికి బీఆర్ఎస్ నాయకులతో కలిసి హాజరై వధూవరులకు అక్షింతలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వివాహ విందులో పాల్గొన్నారు. ఈ వివాహ కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు, జాతీయ ఉత్తమ పంచాయతి అవార్డు గ్రహిత నాసన్‌పల్లి నర్సింహ్మా రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు విష్ణువర్ధన్ రెడ్డి, పటేల్ శ్రీకాంత్ గౌడ్, పలు గ్రామాల, మండల, జిల్లా స్థాయి బీఆర్ఎస్ నాయకులు, పార్టీ అభిమానులు భంధువులు తదితరులు పాల్గొన్నారు.


### బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది సాధారణ ప్రజానీకానికి తెలియచేయునది ఏమనగా మా క్లైంట్ ఈ క్రింది షెడ్యూల్ ఆఫ్ ఆస్తిని క్రింద-పేర్కొన్న వరసక్రమ యజమానులు/పట్టాదారుల నుండి కొనుగోలుకు ఉద్దేశిస్తున్నారు.

ఎవరికైనా పై ఉద్దేశించబడిన విక్రయ వ్యవహారానికి సంబంధించి ఏవైనా అభ్యంతరం, క్లైమ్, ఆసక్తి, వివాదం వున్నట్లయితే అతడు/ఆమె/వారు అతని/ ఆమె/ వారి యొక్క అభ్యంతరాలు/ క్లైమ్‌లు/ వివాద/ములు యొక్క వివరాలు ఆధారాలు చూపించే డాక్యుమెంటరీ నిరూపణతో సహా క్రింది సంతకందారున్ని ఈ ప్రచురణ తేదీ నుండి 7 (ఏడు) రోజులలోపుగా సంప్రదించవచ్చును. విఫలమైతే మా క్లైంట్ ఆ షెడ్యూల్ ఆస్తికి సంబంధించి ఎటువంటి థర్డ్-పార్టీ క్లైమ్‌లు/ అభ్యంతరాలు/ వివాదాలు ఏమీ లేవని మరియు ఆపై ఎటువంటి క్లైమ్‌లు/ అభ్యంతరాలు/ వివాదాలు పరిగణింపబడవని పై యజమానితో విక్రయ వ్యవహారాన్ని పూర్తి చేసుకోవటానికి ఉపక్రమిస్తారు.

#### ఆస్తి యొక్క షెడ్యూల్

ఎక.13-36 గుంటలు కలిగి వున్న కొలతల మొత్తం వ్యవసాయ భూమి అదంతా:

| పట్టాదారుని యొక్క పేరు | సర్వే నం. | విస్తీర్ణం (ఎక.గుం.) |
|---|---|---|
| డి. వెంకట రామి రెడ్డి | 342<br>344 | 0-06<br>0-05<br>0-11 |
| శ్రీ సంజయ్ జలన్ | 344/ఆఅ<br>348ఆ/1 | 2-00<br>9-19<br>11-19 |
| శ్రీ సి.రోహిత్ రెడ్డి | 344ఆఅ/2 | 0-07 |
| శ్రీ ఎం.రాజశేఖర రెడ్డి | 344ఆఈ | 0-13 |

| పట్టాదారుని యొక్క పేరు | సర్వే నం. | విస్తీర్ణం (ఎక.గుం.) |
|---|---|---|
| శ్రీ ఎన్. భవానీ శంకర్ | 343అ/2<br>343ఆ/2<br>343ఈ/2<br>344ఆఅ/1<br>348ఆ/2 | 0-10<br>0-22<br>0-06<br>0-07<br>0-21<br>1-26 |
| | మొత్తం : | 13-36 |

చట్టాన్‌పల్లి గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ వద్ద వున్నది.

సం/- బద్దం వెంకట్‌రెడ్డి,

Y. నాగేశ్వర్ & E. జగదీశ్వర్ రెడ్డి, న్యాయవాదులు

ప్లాట్ నం.110, మొదటి అంతస్తు, నవ నిర్మాణ్‌నగర్, జుబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ వెనుక, రోడ్ నం.71, జుబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.

సెల్: 9948977226, ఇమెయిల్ : ejagan007@gmail.com

# తూంకుంటలో పన్నెండేళ్ల బాలుడు అదృశ్యం

..మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు

**శామీర్‌పేట, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** తూంకుంటలో నివాసం ఉంటూ కూలీ పనిచేసుకుంటున్న దెర్వా నిషాద్ తన పెద్ద కుమారుడు త్రిమ్యాంక్ నిషాద్ (12) గత రెండు రోజుల నుంచి కనిపించటం లేదని శామీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పోలీసులు మిస్సింగ్ కేసును నమోదు చేశారు. బుధవారం శామీర్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత రెండేళ్ల నుంచి తూంకుంటలో నివాసం ఉంటూ కూలీ పనిచేసుకుంటున్న దెర్వా నిషాద్ తన కుటుంబంతో కలిసి జీవనం సాగిస్తున్నారు. అయితే ఈ నెల 5వ తేదీన ఉదయం 9గంటలకు ఫిర్యాదుదారుని భార్య కూలీ పనికి వెళ్లి సాయంత్రం 6గంటలకు ఇంటికి తిరిగి వచ్చె సరికి చిన్న కుమారుడు ఇంటిలో ఉండగా, పెద్ద కుమారుడు త్రిమ్యాంక్ నిషాద్



(12) ఇంటిలో లేరని గమనించినట్లు తెలిపారు. ఆ తరువాత తూంకుంటలో పరిసరాలలో బాలుడి ఆచూకి కోసం వెతికినా ఎటువంటి సమాచారం లభించలేదని దీంతో పోలీసులకు తన పెద్ద కుమారుడు కనిపించటం లేదని శామీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయటం జరిగిందని దీంతో త్రిమ్యాంక్ నిషాద్ కనిపించటం లేదని మిస్సింగ్ కేసును పోలీసులు నమోదు చేయటం జరిగిందన్నారు. అదృశ్యమైన బాలుని వివరాలు త్రిమ్యాంక్ నిషాద్(12), శరీర నిర్మాణం మధ్యస్థం, రంగు మాధ్యమం, జుట్టు నల్లగా, దుస్తులు ఎరుపు రంగు టీషర్టు, నల్లరంగు ప్యాంట్ కల్గి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాలుడు ఎక్కడైనా కనిపించినా, సమాచారం తెలిసినా వెంటనే శామీర్పపేట పోలీస్‌స్టేషన్‌కు, సమీప పోలీస్‌స్టేషన్లకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పెద్దమంగళారంలో అండర్ డ్రైనేజ్ పనులు

## ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయను

**కౌన్సిలర్ గీతా వనజాక్షి**

**ప్రతి గ్రామాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తాం**

**చైర్పర్సన్ సోనియా దర్శన్**

**మొయినాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద మంగళారం గ్రామం 16వ వార్డులో అండర్ డ్రైనేజ్ పనులను బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్పర్సన్ సోనియా దర్శన్, స్థానిక కౌన్సిలర్ గీతా వనజాక్షి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ గీతా వనజాక్షి మాట్లాడుతూ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వమ్ము చేయబోమని అన్నారు. వార్డు అభివృద్ధికి అవసరమైన ప్రతి పనిని దశలవారీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు చైర్పర్సన్ సోనియా దర్శన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి గ్రామాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేయడం తమ లక్ష్యమని తెలిపారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో ఎలాంటి రాజీ ఉండదని పేర్కొన్నారు. అండర్ డ్రైనేజ్ పనులు పూర్తయిన తరువాత గ్రామంలో పారిశుధ్య సమస్యలు తగ్గి ప్రజలకు ఉపశమనం కలుగు తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాములు కుటుంబానికి అసెంబ్లీ సంతాప తీర్మానం



కొండిగారి రాములు కుటుంబ సభ్యులకు సంతాప తీర్మాన ప్రతులను అందజేస్తున్న తహసీల్దార్

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు కొండిగారి రాములు కుటుంబ సభ్యులను బుధవారం రెవెన్యూ అధికారులు పరామర్శించారు. ఆయన మరణానంతరం గత అసెంబ్లీ సమావేశాల్లో రాములు నియోజకవర్గానికి చేసిన సేవలను స్మరిస్తూ.. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రవేశపెట్టిన సంతాప తీర్మాన ప్రతులను ప్రభుత్వం తరపున కుటుంబ సభ్యులకు అందజేశారు. స్పీకర్ పంపిన ఈ అధికారిక తీర్మాన కాపీని ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీతారెడ్డి స్వయంగా వారి నివాసానికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి రాములు చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన అకాలమరణం ఈ ప్రాంతానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కె. శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరసింహ యాదవ్ ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే చిత్రపటానికి అధికారులు నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

## ప్రజా స్థలాల సంరక్షణపై బిజెపి నేతల వినతి

**కొత్తూరు, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** కొత్తూరు మున్సిపల్ పరిధిలో ఉన్న వెంచర్లలో 10 శాతం భూములను కబ్జాలకు గురికాకుండా రక్షణ కల్పించాలని కోరుతూ బుధవారం స్థానిక బిజెపి నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. వెంచర్లలో సాధారణ అవసరాల కోసం కేటాయించిన 10 భూములు ఇటీవల అనధికార కబ్జాలకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పార్కులు, కమ్యూనిటీ స్థలాలు, ఇతర ప్రజా అవసరాల కోసం ఉంచిన భూములు ఆక్రమణలకు గురైతే భవిష్యత్తులో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి ఈ భూములను రక్షించే చర్యలు తీసుకోవాలని, కబ్జాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సంబంధిత భూములను స్పష్టంగా గుర్తించి రికార్డుల్లో నమోదు చేసి రక్షణ కల్పించాలని కోరారు. ఈ అంశంపై మున్సిపల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ ఆనంగారెడ్డి జిల్లా కోశాధికారి అముడాపురం నరసింహ గౌడ్, కొత్తూరు మున్సిపల్ మాజీ అధ్యక్షుడు ఎర్రవెల్లి నాగరాజు, పి శేఖర్ గౌడ్, మల్లేష్, మరియు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలి

..యంపిడిఓ తిరుమల స్వామి



నూతన యంపిడిఓను సన్మానిస్తున్న ఎపిఒ, ఉపాధి సిబ్బంది

**పెద్దేముల్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి వారికి సేవలు అందించాలని యంపిడిఓ తిరుమలస్వామి అన్నారు. బుధవారం నూతన యంపిడిఓగా తిరుమలస్వామి పదవీ భాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉపాధిహామి ఎపిఓ నర్సిములు, సిబ్బంది క్రిష్ణ, శ్రావన్‌గౌడ్, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ ఉష తదితరులు నూతన యంపిడిఓను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా తిరుమలస్వామి మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చూడాలని అన్నారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అన్నారు.

## యంఈఓకు సారిచెప్పిన టిపియుఎస్ ప్రధానకార్యదర్శి అనిల్

..ఇకముందు మండల విద్యాదికారిపై ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయను



మాట్లాడుతున్న యంఈఓ

**పెద్దేముల్, ఏప్రిల్ 8, ప్రభాతవాక్త:** భవిష్యత్తులో మండల విద్యాధికారి నర్సింగ్‌రావుపై ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయనని టిపియుఎస్ ప్రధానకార్యదర్శి అనిల్‌అన్నారని యంఈఓ చెప్పారు.

యంఈఓపై అసత్య ఆరోపణలు, లేనిపోని విషయాలను కల్పించి వివిధ దినపత్రికలో వచ్చిన సందర్బంగా బుదవారం మండల వనరుల కేంద్రంలో తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్ సమక్షంలో విద్యాదికారి నర్సింగ్‌రావుకు అనిల్ క్షమాపణలు చెప్పినట్లు చెప్పారు. ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు మళ్ళీ ఎప్పుడు చేయ నని ఎలాంటి మానసికంగా భాధపడే మాటలు కాని, ఇబ్బందులకు గురిచేసే పను లను చేయనని చెప్పారు. ఇకముందు విధి నిర్వహణలో ఎలాంటి ఆటంకం కలిగించిన, అనుచిత వ్యాఖ్యలు చేసిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని చెప్పినట్లు చెప్పారు.

## పిఎసిఎస్ కార్యాలయం చుట్టూ రైతుల ప్రదక్షిణలు!



దౌల్తాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

**-దౌల్తాబాద్‌లో అస్తవ్యస్తంగా సేవలందిస్తున్న పిఎసిఎస్**

**-పట్టించుకోని అధికారులు...**

**దౌల్తాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాల్సిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని దౌల్తాబాద్ మండల కేంద్రంలో పీఏసీఎస్ సీఈఓగా విధులు నిర్వహిస్తున్న మల్లికార్జున్ తరుచూ విధులకు గైర్హాజరు అవుతండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పీఏసీఎస్ కార్యాలయానికి సీఈఓ ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు వెల్తున్నారో తెలియని అయోమయ స్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. పనుల నిమిత్తం మారుమూల గ్రామాల నుంచి వందల రూపాయల ఖర్చు పెట్టుకొని వస్తే.. కార్యాలయంలో అధికారులు లేకపోవడంతో నిరాశతో వెనుదిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల సమయం వృధా అవడమే కాకుండా, వ్యవసాయ పనులు ఆగిపోతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఈఓ విధులకు గైర్హాజరు కావడంపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి రైతులకు సకాలంలో సేవలు అందేలా చూడాలని మండల రైతాంగం డిమాండ్ చేస్తున్నారు.

## నాలాపై ఆక్రమణలను తొలగించాలని డిసికి ఫిర్యాదు

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ శివారెడ్డిగూడ మారుతీనగర్ ఈద్గా వద్ద నాలాపై స్థలాన్ని ఆక్రమించి దుకాణం కోసం వేసిన డబ్బాను తొలగించాలని స్థానికులు గడీల సంజీవరెడ్డి, సిహెచ్. వెంకటేశం, కె. ప్రవీణ్‌కుమార్, మల్లేశ్‌యాదవ్ తదితరులు ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ అల్లూరి వాణిరెడ్డికి ఫిర్యాదు చేశారు. శ్రీనిధి, మారుతీనగర్ కాలనీ వాసులు నాలా ఆక్రమణపై మడిగెలు వేయడానికి ప్రయత్నిస్తే గతంలో 2024 ఆగష్టులోనే మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారని గుర్తుతెలియని వ్యక్తులు తిరిగి దుకాణం డబ్బానే ఏర్పాటు చేశారని తెలిపారు. బైపాస్ రహదారి సర్వీస్‌రోడ్డు పక్కన సీలింగ్‌భూమిలో ఈద్గాకు ఆనుకొని వాగులో చేరే నాలా ఉందని నాలాపై అక్రమంగా డబ్బా వేశారని పేరొకన్నారు. నాలాపై ఏలాంటి ఆక్రమణలు, నిర్మాణాలు, షెడ్లు, డబ్బాలు లేకుండా తగిన చర్యలు తీసుకొని నాలా స్థలాన్ని



బైపాస్ రహదారి పక్కన నాలా స్థలంలో ఏర్పాటు చేసిన డబ్బా

పరిరక్షించాలని వారు డిసిని కోరారు.

## దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తా

..బాలాజీ హోమ్స్ కాలనీ వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ,

సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

..కాలనీ సమస్యలు పరిష్కరించటానికి కృషి

..అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి

**శామీర్‌పేట, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** మజీద్‌పూర్‌లోని బాలాజీ హోమ్స్ కాలనీ వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సిసి రోడ్డు నిర్మాణ పనులకు అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంతం శిరీషకృష్ణారెడ్డి (ముహూర్తం) శంకుస్థాపన చేశారు. బుధవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని మజీద్‌పూర్‌లోని బాలాజీ హోమ్స్ కాలనీ వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు, సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఆమె విచ్చేసి శంకుస్థాపన చేశారు. బాలాజీ హోమ్స్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించటానికి కృషి చేస్తానని చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి తెలిపారు. కాలనీ వాసుల సమస్యలు అధికంగ ఉన్నాయని వాటిని కూడ దశలవారీగ పరిష్కరిస్తామన్నారు. దీనిలో పాల్గొన్న మున్సిపల్ వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి, కౌన్సిలర్లు సరసం వనజాఅశోక్‌రెడ్డి, సామల జశ్వంత్‌రెడ్డి, ముద్దం సుధాకర్‌రెడ్డిలతో కలిసి నిర్మాణ పనులకు చైర్‌పర్సన్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట మండల రైతుబంధ మాజీ అధ్యక్షులు కమటం కృష్ణారెడ్డి, మున్సిపల్



మజీద్‌పూర్‌లోని బాలాజీ హోమ్స్‌కాలనీ వద్ద సిసి రోడ్డు నిర్మాణ పనులకు ముహూర్తం చేసిన అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి, పాల్గొన్న వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు, నాయకుల,కాలనీవాసులు, తదితరుల దృశ్యం

కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, మాజీ ఎంపిటిసి ఎస్. అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచు ఎల మల్లేశ్, మేడ్చల్ ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, స్థానిక నాయకులు భాస్కర్‌గౌడ్, నర్సింగ్‌రావుగౌడ్, మున్సిపల్ ఎఇ సాన, మున్సిపల్ అధికారి వేణుగోపాల్, ఆ కాలనీ అధ్యక్షులు కె.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కె.దాస్, కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## తుక్కుగూడ ఫ్యాబ్ సిటీలో డిజిపి తనిఖీ



భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డిజిపి శివధర్‌రెడ్డి

**-కమిషనర్ కార్యాలయం నిర్మాణ పనులపై సమీక్ష**

**రంగారెడ్డిఅర్బన్, ఏప్రిల్8, ప్రభాతవార్త:** తుక్కుగూడ ఫ్యాబ్ సిటీలో బుధవారం తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబుకలిసి పర్యటించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న పోలీస్ కమిషనర్ కార్యాలయ భవనాన్ని పరిశీలించి, జరుగుతున్న పనుల పురోగతిని తెలుసుకున్నారు. అధికారులు భవనంలోని వివిధ భాగాలను సందర్శించి, అక్కడ జరుగుతున్న సివిల్ పనులు, విద్యుత్, తాగునీరు, డ్రైనేజ్ వంటి పనులను పరిశీలించారు. పనులు ఎలా జరుగుతున్నాయో చూసి, అవసరమైన మార్పులు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, కమిషనర్ కార్యాలయం అన్ని అవసరమైన సౌకర్యాలతో ఉండేలా నిర్మించాలన్నారు. పోలీస్ సిబ్బంది సౌకర్యంగా పని చేసేలా కార్యాలయం ఉండాలని, ప్రజలకు సేవలు సులభంగా అందేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఇంకా మిగిలి ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని, పనులు ఆలస్యం కాకుండా చూడాలని ఇంజనీర్లకు సూచించారు. పనుల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, నిర్ణయించిన సమయానికి పనులు పూర్తి చేయాలని అన్నారు.

అనంతరం, మీర్‌ఖాన్‌పేట్ ప్రాంతంలో ప్రభుత్వం కేటాయించిన స్థలాలను అధికారులు సందర్శిం చారు.

అక్కడ భవిష్యత్తులో కమిషనర్ కార్యాలయం పనులు ,నిర్మించాల్సిన శాశ్వత భవనాల మాస్టర్ ప్లాన్‌పై సంబంధిత అధికారులతో చర్చించారు.

స్థలాలను పరిశీలించిన అధికారులు ,భవనాల నిర్మాణానికి అవసరమైన విషయాలను చూసి, పనులు త్వరలోనే ప్రారంభించాలని సూచించారు. ఈ నిర్మాణాల వల్ల ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందుతాయని తెలిపారు. త్వరలోనే తుక్కుగూడ నుంచి పూర్తి స్థాయి పోలీస్ సేవలు అందు బాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఈ కొత్త కార్యాలయం ద్వారా సేవలు మరింత సులభంగా, వేగంగా అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ కె.నారాయణ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, ఏసీపీ అరుణ్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నజ్దిక్ సింగారంలో ఆయుర్వేదిక్ అవగాహన

**యాచారం, ఏప్రిల్ 8, ప్రభాతవార్త**

యాచారం మండల పరిధిలోని నజ్దిక్ సింగారం గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా ఆయుర్వేద అవగాహన సదస్సు వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ ఇందిరా ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు వివరించారు. అనంతరము గ్రామంలో అందరికీ ఉచితంగా షుగర్ బీపీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామస్తులకు సలహాలు సూచనలు వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బోడ కృష్ణ, ఉపసర్పంచ్ రవీందర్ రెడ్డి పంచాయతీ సెక్రెటరీ లావణ్య, అటెండర్ దార రాములు, గ్రామ ప్రజలు బాలమణి, చందన, అనిత, చంద్రయ్య తదితరులు



నజ్దిక్ సింగారంలో ఆయుర్వేద అవగాహన కార్యక్రమం సర్పంచ్, ఉప సర్పంచ్



.మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో సమావేశమైన జిల్లా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ విస్తరణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనుచౌదరి .

## ఎల్‌పిజి గ్యాస్ వినియోగం నుంచి పిఎన్‌జి గ్యాస్ వైపునకు మళ్లించాలి

**..మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి**

**..జిల్లాలో మూడు మున్సిపాల్టీల్లో**

**అమలుకు అనుమతులకు మంజూరు ఇవ్వాలి**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:**

ఎల్‌పిజి గ్యాస్ వినియోగం నుంచి పైప్‌డ్ నేచురల్ గ్యాస్ (పిఎన్‌జి గ్యాస్) వైపునకు (డొమెస్టిక్, కమర్షియల్, ఇండస్ట్రీయల్) వినియోగంను మళ్లించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లా సిటీగ్యాస్ డిస్ట్రిబ్యూషన్ విస్తరణ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగ కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ జిల్లాలోని మూడు మున్సిపాల్టీలు మూడుచింతలపల్లి, అలియాబాద్, ఎల్లంపేట్ ప్రాంతాలలో మెగా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు పైప్‌లైన్ ఎక్స్పాండ్, విస్తరణ క్రమంలో వారికి అన్ని సంబంధిత శాఖల వారి నుంచి వచ్చిన వెంటనే అనుమతులు లభించేలా చూడాలని అన్ని శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, ఉన్నత పోలీసు అధికారులు, పలు శాఖల అధికారులు, మూడు మున్సిపాల్టీల కమిషనర్లు, మెగా గ్యాస్ మేనేజర్, తదితరులుపాల్గొన్నారు.

## గాలికుంటు టీకాలతో పశువులకు ఆరోగ్యం

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలంలో నెలరోజుల పాటు పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైధ్యాధికారిణి పద్మిని తెలిపారు. చివరి రోజు మంగళవారం ఘట్‌కేసర్ పట్టణంలో పలు చోట్ల గాలికుంటూ టీకాలు వేయడం జరిగిందన్నారు. ఈసందర్భంగా 45 ఆవులకు, 25 గెదేలకు గాలికుంటూ నివారణ టీకాలు వేసినట్లు ఆమె తెలిపారు. సంవత్సరానికి రెండు సార్లు గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలు వేస్తారని పశుపోషకులు తమ పశువులను వ్యాధి నుంచి కాపాడుకుంటున్నారని తెలిపారు. ఘట్‌కేసర్, ఎదులాబాద్, అంకుశాపూర్ పశువైద్య బృందాలు గ్రామాలలో పశువుల పాకల వద్దకు వెళ్లి పశువులకు టీకాలు వేశారని తెలిపారు.

## రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రామంతాపూర్ శారదానగర్‌కు చెందిన మేక రామచందర్‌రావు (72) ఎస్‌విటి ఇండస్ట్రీయల్ మేనేజర్‌గా రిటైర్ట్ కాగా ఇంటివద్దనే ఉంటున్నాడు. మంగళవారం ఇంట్లో భార్యతో గొడవ జరుగగా తన స్ప్లెండర్ బైక్ తీసుకొని ఘట్‌కేసర్‌కు చేరుకున్నాడు. మాధవరెడ్డి వంతెన దగ్గర బైక్‌ను నిలిపి వంతెన కింద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. వంతెన కింద మృతదేహం పడి ఉందని సికింద్రాబాద్ డిప్యూటి ఎస్‌ఎస్ ద్వారా సమాచారం రావడంతో జిఆర్‌పి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి విచారించారు. రైలు పట్టాల దగ్గర ఉన్న స్ప్లెండర్ బైక్ నంబర్ ఆధారంగా వివరాలు సేకరించి పోన్ చేయగా మృతుని కుమారుడు మాట్లాడగా తన తండ్రి ఇంట్లో గొడవపడి వెళ్లాడని తెలిపారు. మృతదేహానికి గాంధీ ఆసుపత్రిలో పిఎంఈ పూర్తి చేయించి కుటుంబసభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని జిఆర్‌పి పోలీసులు తెలిపారు.

## మృతుని కుటుంబానికి రెడ్డి సంఘం ఆర్థికసాయం

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** అనారోగ్యంతో చనిపోయిన మెడబోయిన పోచయ్య కుటుంబానికి అంకుశాపూర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అంకుశాపూర్‌లో వారంరోజుల క్రితం అనారోగ్యంతో మెడబోయిన



మృతుని కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న రెడ్డి సంఘం నాయకులు

పోచయ్య మృతిచెందాడు. ఈమేరకు స్థానిక రెడ్డి సంఘం నాయకులు మోర రాజిరెడ్డి, బద్దం కార్తీక్‌రెడ్డి, అర్థ మహిపాల్‌రెడ్డి, అర్థ లింగారెడ్డిలు స్పందించి మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ. 10 వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. ఈకార్యక్రమంలో ఆర్థ బుచ్చిరెడ్డి, మామిడి సత్తిరెడ్డి, అర్చన కొండల్‌రెడ్డి, పైళ్ల శివారెడ్డి, మామిడి దామోదర్‌రెడ్డి, చింతల మల్లారెడ్డి, సామల రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తాళ్లపల్లి విద్యుత్ ఫీడర్‌లో నేడు అంతరాయం

**షాబాద్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** తాళ్లపల్లి విద్యుత్ ఫీడర్ లో సమస్యలను పరిష్కరించేందుకు చేపడుతున్న పనుల కారణంగా గురువారం షాబాద్ మండలంలోని తాళ్లపల్లి విద్యుత్ ఫీడర్ నుండి విద్యుత్ సరఫరా అవుతున్న తాళ్ళపల్లి, వెంకమ్మగూడ, తిమ్మారెడ్డిగూడ గ్రామాల్లో మంగళవారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు చెట్ల కొమ్మలు అడ్డు వచ్చి సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నందున వాటిని తొలగిస్తున్నందున ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్లో అంతరాయం ఏర్పడు తుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.